# కవితా కౌముది

## చిరునవ్వు ప్రయాణం
### గంజాం భ్రమరాంబ

ఎన్నో నిరంకుశత్వాలను
తృణీకరిస్తూ..
ఎన్నో అవహేళనలను
అధిగమిస్తూ..
ఎన్నో నిరాశలను
తరిమేస్తూ..
ఎన్నో అహంభావాలను
పరిహసిస్తూ..
ఎన్నో వివక్షతలను
దీటుగా ఎదుర్కొంటూ..
ధైర్యాన్ని తోడుతీసుకొని
సానుకూల స్పందనతో స్నేహం చేస్తూ
ఆత్మస్థైర్యం వెంటరాగా
ఆత్మవిశ్వాసం వెన్నంటిఉండగా -
ఒక చిరునవ్వు ప్రయాణించింది
తన కలల సామ్రాజ్యాన్ని
సాకారం చేసుకోవడానికి...
తన ఆశయాల వెలుగును
జగమంతా పరచడానికి..!!!

★★★

## భావవీచికలు
### మూలా వీరేశ్వరరావు

1) నేను సీతా కొక చిలుక
ఒకే సారి ప్రయాణం
తాను రెక్కల తో ఎగిరి పోయింది
నేను ఇంకా రెక్కల కోసం వెతుకుతున్నా !
2) నదికి ఒకటే కేరింత
తన చేతి లో చంద్రుడు
ముక్కలయ్యాడని !
3) ఆమె ఆవలి తీరం చేరింది
నదిలో దిగులు అలలు !
4) కీచు రాళ్ళూ
చెదిరిన కోయిలల గూళ్ళు
5) నీవు వెళ్లి నప్పుడు
మనసు మౌనం !
కళ్ళకి గుండె తగిలిందేమో
రెండు సముద్రాలు !
6)చిన్నప్పుడు ఆమె
చిందులేసే పాప
ఎదిగాక
ఎక్వారియం లో చేప !
7) నిన్న ,నేడు అవే
అలలు
నిన్న నేడు అవే
కలలు
తెలియనదల్లా
జీవితం పన్నే వలలు !
8) రాళ్ళ మీద నర్తించేది ఉలి
రాళ్ల లాంటి మనుషుల వల్ల
తీర లేదు ఆకలి !

★★★

## అంతటా అదే
## మాడభూషి శ్రీధర్

ఆశయాల ఆశల కాంతుల్ని పేని
నవజీవనరేఖను నేల లాగుతున్నది,
ఆవిరైన అనుభవాల కాంతిపుంజం
నేలవిడిచి గగనానికి సాగుతున్నది,
శతవసంతం రెప్పమూసిన సమయం
నవవసంతం కన్ను తెరిచిన సందర్భం,
ఒక తార అవతరించింది
ఇంకో తార తరించింది,
ఆనంద నంది శివమై దీవించింది
నారాయణి జీవమై దీపించింది,
‘నేనూ‘ నూనె ఐ వత్తిగా వెలిగింది
నెనరు చమురై వ్యక్తిగా నిలిచింది,
ముగిసే నిన్నను ఆపి ఈ క్షణం
రేపటి ఆశకు పురుడు పోసింది,
క్షణాలన్నీ చేతులు పట్టుకుని మానవ
హారపు ఘడియలై గడుస్తున్నాయి,
ఆగనంటున్న కాలం కొత్త రోజులై
బుడిబడి అడుగులై నడుస్తున్నాయి,
వసుంధరను ఆవహించిన విశ్వమూ
ప్రాణవాయువై ఆవరించిన విష్ణువూ
అగ్నిని అక్కున చేర్చుకున్న శివుడూ
శిశిరంలో చిగురించిన జీవుడూ..
అదే అనంతర పరంపరానందం
అదే నిరంతర ఆనంద వైష్ణవం!!

★★★

## గొడ్రాలు
## లక్ష్మిరాధిక

ఎప్పటికీ ఏకమవని ఆలోచన..
అయినా వీడిపోదని
కొంత కవిత్వాన్ని వెంటేసుకొని
నాతో రాయించేస్తావ్
నీకు నచ్చుతుందో లేదో అప్రస్తుతం
కానీ ఎప్పుడో ఒకప్పుడు
ఒళ్ళంతా కళ్ళు చేసుకొని
చదువుకుంటావ్..

మనసులో మరుగుతూ
వేడిగా కదిలే రుధిరపు ఆనవాళ్ళు
కొన్ని రాత్రుల్లో నిదురను దూరం చేసే
సవ్వళ్ళుగా మారుతాయ్
నీకేమీ కాలేకపోయిన
ఈ బ్రతుకు పయనంలో
మృత్యువే గమ్యమని తెలిసొచ్చాక
క్షణాల కదలిక మందగిస్తుంది

రాత్రులకి శాపముందేమో తెలీదు
కానీ నాలో నిశ్శబ్దాన్ని రెచ్చగొట్టాలని
చూసే చొరవుంది
అందుకే కలలు సైతం కనలేని
నేనో గొడ్రాలిని..:(

***



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

చెలియ! యెవరిది నిండైన జీవితమ్ము?
అనుదినమ్మును ప్రేమార్థులైన మనదొ!
పరహితార్థులై సన్యసత్వమును పొంది
త్యాగశీలురైనట్టి సంయమివరులదొ!

హృదయమును నమ్మి ప్రేమకై యిలను బ్రతికి
ఒకరికొకరమై మనమెప్పుడుందుమిచట
మనసు మార్గమునే యెంచుకొనిన యతులు
సకలజనులకై వెచ్చింత్రు శ్రమమునెపుడు

హృదయమెవ్వరికి యతీంద్రులీయజనరు
దినము లోకచింతనె వారి మనసులోన
కఠినమైనది వారల కాలిబాట
ప్రేమ యెరుగని యరుదైన వింతత్రోవ

పచ్చనైనట్టి పచ్చిక బయలు మనది
మధురకౌముది నిండు యామవతి మనది
పగలు రేయియునానందవార్ధి మనది
సత్యమైనను యూహల జల్లెడైన

కవులు గాయకులౌ వారి లోకమ్ముగాని
ప్రేమికులు కళాత్మకుల జీవితముగాని
పూర్ణమై వెల్గునొక యనుభూతితోడ
హృదయమును నింపునానందహేల తోడ


చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS